
# రక్తదానం

వసుంధర




'డాక్టర్! నా రక్తం పనికొస్తుందేమో చూడండి...'

ఉలిక్కిపడి తలెత్తి చూశాను. ఎవరో అపరిచితుడు. యువకుడు. ఆరోగ్యవంతుడు.

అతని మాటలు నాకు అమృతోపమానంగా తోచాయి. నాకే కాదు. అప్పుడు నా పరిస్థితిలో ఉన్న ఎవరికైనా అంతే!

అనుకోకుండా ఒక భయంకర పరిస్థితిలో ఇరుక్కున్నాను నేను.

ఇక్కడ మంచి ఎగ్జిబిషన్ జరుగుతోందనీ—పిల్లల నిక్కడకు పంపించమనీ—నాన్నగారికి ఉత్తరం రాశాను. తమ్ముడికీ, చిన్నచెల్లెలికీ పరీక్షలట. పెద్దచెల్లెలు హేమ ఒక్కతే ఖాళీగా ఉందని-దాన్ని పంపించారు నాన్నగారు—తెలిసిన వాళ్లెవరో ప్రయాణమైతే, వాళ్లను తోడుగా ఉంచి.

హేమ వచ్చేసరికి నా ఆరోగ్యం బాగా లేదు. తరచుగా జ్వరం వస్తోంది. నాకు బాగా నీరసంగా ఉంటోంది. ఎగ్జిబిషన్ చూపించడానికి బదులు—దానిచేత పరిచర్యలు చేయించుకోవడమైంది నా పని.

ఒంట్లో కొంచెం కుదుటపడిందనిపించేక—ఇంకా నీరసం తగ్గకపోయినా—ఒక రోజున హేమను తీసుకుని ఎగ్జిబిషన్‌కు బయల్దేరాను. అదృష్టం బాగుండకపోతే అంతే జరుగుతుంది.

నేను వేగంగా కదలలేక పోతున్నాను. అడపాతడపా కళ్లు తిరుగుతున్న అనుభూతి కూడా కలుగుతోంది. అటువంటి పరిస్థితుల్లో—ఏమయిందో తెలియదుగానీ—హఠాత్తుగా ఎవరో నన్ను పక్కకు లాగినట్లయింది. బహుశా హేమే ననుకుంటాను. కానీ అంతలోనే ఒక స్త్రీ ఆర్తనాదం కూడా వినిపించింది. ఆ కంఠస్వరం కూడా హేమదే ననుకుంటాను.

నాకు స్పృహ వచ్చేసరికి ఒక ప్రయివేట్ డిస్పెన్సరీలో ఉన్నాను. నా ఎదురుగా స్నేహితుడు సుందరం ఉన్నాడు. అతను చెప్పాడు. హేమకు యాక్సిడెంటయిందని—ఇంకా స్పృహ రాలేదుట. యాక్సిడెంటయిన సమయంలో అతగాడు ఆ ప్రాంతంలోనే ఉండి మమ్మల్ని చూడ్డం సంభవించిందిట. తనకు తెలిసిన ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌కు వెంటనే తీసుకు వచ్చాడుట.

ఇంతలో డాక్టర్ వచ్చి నన్ను పలకరించాడు. ఆ పలకరింపు చాలా హడావుడిగా ఉంది...'మీ చెల్లెలికి అర్జంటుగా రక్తం అవసరం. తెలిసిన బంధువు లెవరైనా ఉన్నారా?'

'ఎవరో ఎందుకు డాక్టర్! నేనే ఉన్నాను.' అంటూ చేయి ఎత్తబోయాను. ఆ నాచేయి లేవలేదు.

డాక్టర్ నవ్వి— 'మీ ఆరోగ్యం బాగా లేదు. మీ రక్తం పనికిరాదు. మీ సుందరం గారు కూడా తన రక్తం ఇస్తానన్నారు. కానీ టెస్టుచేస్తే ఆయన రక్తం పనికి రాదని తేలిపోయింది. అర్జంటుగా చెప్పండి. రక్తదానం ఇచ్చే బంధువు లెవరైనా ఉన్నారా మీకిక్కడ?'

నాకు మళ్లీ కళ్లు తిరిగినట్లనిపించింది. హేమకు రక్తం కావాలి. అదీ నేనూ ఒకే రక్తం పంచుకు పుట్టాం. దానికి రక్తం కావాలి. నాదగ్గర రక్తం ఉంది. కానీ అది పనికి రాదు. దప్పికలో ఉన్నవాడికి సముద్రపు నీరు ఎంత ఉపయోగమో ఇప్పుడు దానికి నా రక్తమూ అంతే!

త్వరత్వరగా గుర్తు వచ్చిన ఇద్దరు ముగ్గురు బంధువులపేర్లు చెప్పాను. అందులో ఒకరికి ఫోన్ ఉంది. మిగతా వాళ్లని సుందరం మోటార్‌సైకిల్‌మీద వెళ్లి వెదికాడు కానీ పని జరుగలేదు. రక్తదానం ప్రసక్తి వచ్చేసరికి ఆ బంధువులకు అర్జంటుపనులు తగిలి మమ్మల్ని చూడ్డానికి కూడా రా వీలుకాలేదు.

డాక్టర్ అంటున్నాడు— 'సమయం మించిపోతోంది, ఎవరో ఒకరు దొరికితే బాగుండును.'

నేను సర్వశక్తులూ కూడదీసుకుని అన్నాను —'నేను అసహాయస్థితిలో ఉన్నాను డాక్టర్—మీరే నా చెల్లిని రక్షించాలి. ఎంత డబ్బయినా ఫరవాలేదు...'

డాక్టర్ అదోకలా నవ్వేడు —'ఇప్పుడు కావలసింది డబ్బుకాదు—రక్తం...'

అవును, నిజమే! డబ్బు, రక్తం ఒకటి కాదు.

రక్తం ధారపోసి డబ్బు సంపాదించే ప్రజలనేకులున్నారీదేశంలో, సంపాదించడంలోని కష్టాన్ని తెలియజెప్పడంకోసం —'ఇది డబ్బు కాదురా—నా రక్తం' అంటారు చాలా మంది. అయితే—రక్తంతో డబ్బు సంపాదించ వచ్చునేమోగానీ—డబ్బుతో రక్తాన్ని సంపాదించడ మంత సులభంకాదు. ముందు మనక్కావలసిన రక్తంగల మనిషి దొరకాలి. ఆతరువాతనే డబ్బు పనిచేసేది. ఆ మనిషి ...దొరుకుతాడా? హేమ బ్రతుకుతుందా?

హేమ అంటే నాకు ప్రాణం. దానికీ నాకూ ఆరేళ్లు తేడా. దానికీ నేనంటే ఎంతో ఇష్టం. అది ఎంతో మంచిదికూడా. అనలది మంచిది కావడంవల్లనే—దేవుడు తొందరగా దాన్ని తీసుకుపోవాలనుకుంటున్నాడేమో—

నేను మళ్లీ అన్నాను— 'మీరు చెప్పేది నిజమే డాక్టర్—కానీ ఆ రక్తం ఎవరైనా ఇచ్చేమాటయితే—ఎంత డబ్బయినా...'

'డాక్టర్—నా రక్తం పనికొస్తుందేమో చూడండి!'

అమృతోప మానాలైన ఈ మాటలువిని నేను తలెత్తి చూశాను, ఎవరో అపరిచితుడు. యువకుడు. ఆరోగ్యవంతుడు. బహుశా మా సంభాషణను కొంత విని ఉండాలి.

హేమ అదృష్టం బాగుంది. అతనిరక్తం పనికి వచ్చింది.

నా చెల్లి బ్రతికింది!

అయితే నా చెల్లిని బ్రతికించిన యువకుడు మాత్రం ఇంకా అపరిచితుడుగానే ఉండిపోయాడు. తన వివరాలేమీ తెలుపకుండానే అతను తన కర్తవ్యాన్ని ముగించుకుని వెళ్లిపోయాడు.

తర్వాత సుందరం చెప్పినదాన్నిబట్టి నాకు తెలిసిన దేమిటంటే—సుందరం రోడ్డుకాసి —రిక్షావాళ్లనీ వగైరాలని పలకరించి రక్తదానం గురించి అడిగే ప్రయత్నంలో ఉండగా—దారిన పోతున్న ఈ యువకుడు విషయం గ్రహించి సాయం చేయడానికి వచ్చాడట. ఎంత నొక్కించి అడిగినా అతను వివరాలేమీ చెప్పలేదుట.

అతన్ని కలుసుకోలేక పోయినందుకు నాకు చాలా బాధ కలిగింది. తర్వాత నెలల్లో ఇంటికి వెళ్లినపుడు — వివరంగా అతణ్ణిగురించి అమ్మకు చెప్పాను. అప్పుడు అమ్మ— 'అతగాడు మానవ మాత్రుడయుండడు. హేమను బ్రతికించడంకోసం వచ్చిన దేవదూత. వచ్చాడు. పని ముగించుకుని వెళ్లిపోయాడు. మరి మనకు కనబడడు—' అంది.

ఆ మాటలు నిజమేనేమో.

* * *

నేనందరివంటివాడనూ కానని అనిపిస్తుంటుంది నాకు. ఎదుటివారి కష్టాలకు చలించిపోయే సున్నితహృదయమూ, ప్రతివారికీ సహాయం చేయాలనే కోరికా, ఎవ్వరికీ బాధ కలిగించని మనస్తత్వమూ, సంఘంలోని మూఢాచారాలూ, దురాచారాలూ నిర్మూలించాలన్న ఆశయమూ, నలుగురికీ ఆదర్శప్రాయంగా నిలవాలన్న అభిలాషా ఉన్నాయి నాకు.

ఇన్నీ ఉన్న నాలో ఒకటే లోపముంది. ఆ లోపంవల్లనే నాలోని ఈ విశిష్ట లక్షణాలు వెలికి రాకుండా ఉండిపోయాయి. నాలో ఇటువంటి భావాలు చెలరేగుతున్నాయని ఎవరూ అనుకోలేనిస్థితిలో ఉన్నాను—ఆ లోపమేమిటంటే నాలో ఉండవలసినంత ఆవేశంలేదు. అందుక్కారణం-నేను వాస్తవికతను బాగా అర్థం చేసుకుని మసలడమే ననుకుంటాను.

ఆకలితో అలమటించే నిరుపేదలను చూసినపుడు నాలో ఆవేశం కలిగేమాట నిజం. అయితే ఆ ఆవేశం ఎంతోసేపు నిలబడదు. జేబులో ఉన్న ఒక్కరూపాయీ అవతలవాడి కిచ్చేస్తే...అవతలివాడి కాపూటకు ఆకలి తీరవచ్చు. కానీ మర్నాడేమవుతుంది? ప్రతీపూటా ఆతడి ఆకలి తీర్చేశక్తి నా.కెక్కడిది? అలా తీర్చలేనపుడు ఈ రోజు మాత్రం అతనికీ డబ్బు ఎందుకివ్వాలి? రూపాయి నాకు చాలా విలువైనది. ఎంతో అవసరమైనది. ఎంతో గొప్పకార్యాన్ని సాధిస్తున్నప్పుడు తప్ప—ఆ రూపాయిని-ఇతరులకోసం ఖర్చుపెట్టకూడదు. ఇన్ని ఆలోచించుకుని, దానం చేయడం మానేస్తాను, బిచ్చగాడి దృష్టిలో—ఆలోచించి దానం మానేసిన నేనూ, ఆలోచించకుండా దానం చేయని మంగోహడూ ఒకటేగదా!

ఆర్థికంగా చెప్పుకోదగ్గ స్తోమతులేదు నాకు. అందుక్కారణం మేము జీవించే పద్ధతి మాత్రమే. అనగా మేము అప్పర్ మిడిల్‌క్లాస్‌కు చెందినవారం. మన దేశంలో వీరికి మించిన పేదలులేరు.

వీరికీ పేదవాళ్లమని చెప్పుకునేందుకు నామోషీ. చిన్నవాళ్లతో తిరగడం నామోషీ. చిన్నచదువులు చదవడం నామోషీ. ఇంటో పనిమనిషి లేకపోయినా, సినిమాకి బాల్కనీ టికెట్ కొనకపోయినా నామోషీయే! వీరు ఖరీదైన బట్టలు కడతారు. విలాసంగా జీవితం గడుపుతున్నట్లు కనబడ్డానికి ప్రయత్నిస్తారు. సేవాసంస్థలకు చందాలనిస్తుంటారు. ఈ ఖర్చులకూ, ఆదాయానికీ సరిపడక వీరుపడే ఇబ్బందులు—ఇన్నీ అన్నీ కావు. మా నాన్నగారూ ఆ వీరిలో ఒకరు. నేను లక్షణాలన్నీ మా నాన్నగారి వద నుంచి సంతరించుకున్నాను. అందువల్లనే తాహతుకు మించిందే అయినా యమ్మెస్సీ చదివాను. తక్కువ ఆదాయం గలవారికిచ్చే నగంజీతం కన్సెషన్‌కు అప్లయ్ చేయడానికి—నేను చదువుతున్నంత కాలమూ కూడా మా నాన్నగారంగీకరించలేదు. మాకెప్పుడూ ఒక్కటేభయం—ఎదుటివారు మమ్మల్ని పేదవారనుకుంటారేమోనని.

అలా అనుకుంటారేమోనన్న భయం ఒకవిధంగా నాకుపయోగించింది. నేను డబ్బు బాగా సంపాదించాలనే ఉద్దేశ్యంతో

# రక్తదానం

మాత్రమే—చాలా కష్టపడి చదివాను. అనుక్షణమూ కష్టపడి చదవాల్సిన అవసరాన్ని గుర్తు చేసుకుంటూనే పాఠాలు చదివాను. ఎన్నడూ—నా విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాననే తలపును కలలోకి కూడా రానీయలేదు. నేనెంత సామాన్యుణ్ణో దీన్నిబట్టే అంచనా వేయవచ్చు.

అనంతరం నాకొక ప్రయివేటు కాలేజీలో ఉద్యోగావకాశం వచ్చింది. అందుకు నాన్నగారి పలుకుబడీ ప్లస్ వేయి రూపాయల లంచం తోడయాయి.

లంచమంటే నాకు పరమ అసహ్యం. కాలేజీలో అనేక పర్యాయాలు నేను దేశంలో లంచగొండితనాన్ని రూపుమాపవలసిన అవసరాన్ని గురించి బల్లగుద్ది వక్కాణించి—బహుమతులు సంపాదించుకున్నాను.

కానీ జీవితం కాలేజీలో లేదు. కాలేజీ బయట మాత్రమే ఉంది. ఆదర్శాలు నమ్ముకుంటే, పాటించి తీరాలనుకుంటే జీవితం సాఫీగా ఉండదు. నా ఒక్కడి జీవితం ఎలా పోయినా ఫరవాలేదు, మా నాన్నగారు, నా తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు. అమ్మ—అందరి జీవితాలూ నా జీవితంతో ముడిపడి ఉన్నాయి. నేనేదో సంపాదిస్తాననే ఆశతోనే నాన్నగారు నన్నింత వరకూ చదివించారు. లేకపోతే చాలా మందికిలాగే నేనూ ఏ మెట్రిక్‌తోనో ఆపేసి వంద రూపాయల జీతంతో గానుగెద్దు జీవితం గడపాల్సి ఉండేది. నాకోసం ఎంతో కష్టపడ్డ నాన్నగారికి సహాయపడడం — నా కనీస బాధ్యత. ఆ బాధ్యను తీర్చుకోవడం కోసం ప్రాణం ఇచ్చినా తప్పులేదు. అటువంటిది— లంచం—అదీ నా సొమ్ముకాదు, నాన్నగారి సొమ్మునే ఇవ్వడంలో తప్పేముంది? ఒక మహాకార్యాన్ని సాధించే ఉద్దేశ్యముంటే —అందుకు అడ్డదారులు తొక్కినా తప్పులేదు. ప్రజలకు మేలుచేసే ఉద్దేశ్యంతో శ్రీరాముడంతటివాడు స్త్రీ హత్య చేశాడు. అటువంటప్పుడు నేను...

నాలోటి సామాన్యుడి తలిదండ్రులకు సాయపడ్డం కంటె మహాకార్య మేముంటుంది? అందుకే నేను ఒక అవినీతిపరుణ్ణి స్వయంగా ప్రోత్సహించి ఉద్యోగం సంపాదించుకున్నాను. ఇది నా పతనానికి మొదటి మెట్టు మాత్రమే!

వివాహం విషయంలో నాకు చాలా పట్టుదల ఉండేది. నా వివాహం అందరివంటిదీ కాకూడదనీ— అందరూ గొప్పగా చెప్పుకునే విశేషముండాలనీ అనుకునేవాడిని. ఆ అభిప్రాయంతోనే—ఎవరైనా బాలవితంతువును గానీ లేక తక్కువకులం పిల్లనుగానీ చేసుకోవాలని అనుకున్నాను మొదట్లో. నా అభిప్రాయాలను పసిగట్టిన మా నాన్నగారు నాకో రోజున ఉపన్యాస మిచ్చారు. అది బహుమతి సంపాదించడం కోసం చేసిన ఉపన్యాసం కాదు. నేనేమైనా పొరబాటు చేస్తానేమోనన్న భయంతో. తన సంసారపు భవిష్యత్తు గురించి కలవరపాటుతో చేసిన ఉపన్యాసమిది.

ఆ ఉపన్యాస సారాంశ మేమిటంటే — నాకిద్దరు చెల్లెళ్లున్నారు. వాళ్లకు వివాహాలు జరిపించడానికి — తండ్రిగా ఆయన కెంత బాధ్యత ఉందో, పెద్దకొడుకుగా నాకూ అంతే ఉంది. ఆంధ్రదేశానికి సంబంధించినంత వరకూ — వర్ణసంకరాలూ, వితంతు వివాహాలూ జరిగిన ఇంట్లోని ఆడపిల్లలకు పెళ్లికావడం— ఈ శతాబ్దంలోని అసంభవాలలో ఒకటి! నేనేమి చేసినా —ఇంట్లోని ఎవరి భవిష్యత్తుకూ నష్టం వాటిల్లని పద్ధతిలో చేయాలి.

అసలే వాస్తవికత ప్రభావానికి లొంగిపోయేవాడిని నేను. నాన్నగారి ఉపన్యాసం నన్ను కదిలించింది. ఆ తర్వాత నేను చుట్టూ ఉన్న ఈ ప్రపంచాన్ని పరిశీలించి ఆయన ఉపన్యాసం చాలా అర్థవంతమైనదని గ్రహించాను. పనిగట్టుకుని సంస్కరణలకు దిగడం కంటె, సాఫీగా బంధువులతో జీవితం గడపడమే, మేలనిపించింది. అందువల్ల — వివాహం విషయంలో నా అభిప్రాయం మరోవిధంగా మార్చుకున్నాను. మా కులంలోనే ఒక పేద పిల్లను పెళ్ళిచేసుకుని — కనీసం ఒక అమ్మాయికైనా వరకట్న పిశాచి కోరల బారినుండి తప్పించిన తృప్తిపొందాలని. ఈ నిశ్చయం కలిగిన వెంటనే నాన్నగారికి చెప్పలేదు. ముందు వారి దృష్టిలోఉన్న పేద బంధువుల్లో ఒక అందమైన అమ్మాయిని ఎన్నుకున్నాను.

ఆ అమ్మాయిపేరు పద్మ. పేరుకంటే కూడా మనిషి బాగుంటుంది. ఆ అమ్మాయి వరుసకు నాకు మరదలవుతుంది. చుట్టపుచూపుగా ఏడాద్రికితం మా ఇంటిక్కూడా వచ్చింది— తలిదండ్రులతో కలిసి. అప్పుడు మా అమ్మ ఆ అమ్మాయినిచూసి ముచ్చటపడి— 'ఎవరింటి కోడలవుతుందోగానీ — చిదిమి దీపం పెట్టుకోవచ్చు' అంది. అమ్మ ఆ అభిప్రాయం వెలిబుచ్చగానే — ఆ అమ్మాయిని చిదిమిదీపం పెట్టుకునే అవకాశం— అమ్మకే ఇవ్వాలనుకున్నాను నేను. అప్పట్నించీ ఆమెను ప్రేమించడం మొదలుపెట్టాను. ప్రేమ అనే పదాన్ని వాడడం ఎంతవరకూ సమంజసమో నాకే తెలియదు. ఎందుకంటే ప్రేమ అనుకోకుండా దానంతటది కలుగుతుందంటారు. నేను ఎన్నుకుని ఓ అమ్మాయంటే ఇష్టపడ్డం ప్రారంభించాను. ఆ ఇష్టానికి ప్రేమ అని పేరు పెట్టాను.

నా కుద్యోగం వచ్చిన ఆర్నెల్లకే నాన్నగారు నా వివాహం గురించి ఆలోచించడం మొదలుపెట్టారు. ఆయన నాలోచింపజేసింది— అనేకమంది ఆడపిల్లల తలిదండ్రులు. చాలామంది బంధుత్వాలు కలుపుకుంటూ మా ఇంటికి చల్లకొచ్చేవారు! దాచినముంతను చాలాసేపటికిగానీ బయటకు తీసేవారు కాదు. అలా వచ్చినవారిలో పద్మ తండ్రికూడా ఉన్నాడు. ఖచ్చితంగా నాన్నగారాయన కొక్కరికే జవాబు చెప్పేశారు. 'మాకు కావలసిన కట్నం మీరివ్వలేరు. వేరే సంబంధాలు ప్రయత్నించుకోండి—' అని.

అప్పుడే నేను షాక్ తిన్నాను. నేను ప్రేమించిన పద్మ నాకు దక్కదా అని నేను కలవరపడ్డాను. పద్మ దక్కదన్న బాధ కంటే— నా ఈ ఆశయంకూడా నెరవేరడం లేదన్న బాధే ఎక్కువగా కలిగింది నాకు. కొంచెం కోపంకూడా వచ్చింది.

నెమ్మదిగా అమ్మదగ్గరజేరి గొణగడం ప్రారంభించాను. నా గొణుగుడు అమ్మ నాన్నగారికి రిలే చేసింది. 'ఇప్పుడు మనకు డబ్బెంత అవసరమేమొచ్చింది— సంప్రదాయమైన పిల్లను కట్నంలేకుండా చేసుకుంటే యేం—' అన్నది నా ప్రశ్న.

నాన్నగారేమీ కలవరపడ్డట్టు కనబడలేదు. ఆయనకు నామీద నమ్మకముంది — నేను తర్కానికి లొంగిపోయేవాడినని నన్ను లొంగదీసే తర్కంకూడా ఆయనకు తెలుసు.

'మనకు డబ్బు అవసరమేమిటీ అనికదూ

మవ్వు అడిగావు. నిజానికి మనకు డబ్బు అవసరం లేదు. కానీ అనుకోకుండా మన కిప్పుడు పదివేలు అవసరమయాయనుకో— అప్పుచేశామనుకో— అప్పుడు మనకు— ఆ డబ్బు పోగుచేయడానికి — ఇప్పుడున్న పరిస్థితుల్లో— ఎంతకాలం పడుతుంది?'

లెక్కల్లో నాకున్న ప్రావీణ్యం తెలిసుండే మా నాన్నగారీ ప్రశ్న వేసుంటారు. కానీ ఈ ప్రశ్నకు జవాబు చెప్పడానికి లెక్కల్లో ప్రావీణ్యం చాలదు. జీవితంలో అనుభవం కావాలి. జీవితం ఎల్లకాలమూ ఒక్కలాగే ఉండదు.

అనుకోని ఖర్చులు అతిథులరూపంలో, రోగాలరూపంలో, పెరిగే ధరలరూపంలో— ఇలా కృష్ణుణ్ణి పరిమార్చడానికి వచ్చే రాక్షసులలాగ అనేక రూపాల్లో వస్తాయి. వాటిని జయించడానికి దైవశక్తి అవసరం. అది కృష్ణుడికే ఉంది. మనకు లేదు. అదీకాక నాకు వివాహమైతే క్రమంగా పిల్లలు పుట్టుకు వస్తారు. సంసారం పెరుగుతుంది. ఇప్పటికే నిలవ చెప్పుకోదగ్గదిగా లేదు.

'చాలా సంవత్సరాలు పడుతుందనుకోండి. కానీ అంతడబ్బు మనకెందుకు— ఏం చేసుకుంటాం?' అన్నాను నేను అసహనంగా.

నాన్నగారు నవ్వారు. 'అంత డబ్బు మనకవసరం లేదనిపిస్తే నువ్వు పద్మను పెళ్ళి చేసుకుందుకు నాకూ అభ్యంతరంలేదు. కానీ హేమకక్కూడా నీలాంటి అభిప్రాయాలే ఉన్న ఓ కుర్రాణ్ణి చూసిపెట్టు.'

ఈమాటలనేసి ఆయన అక్కణ్ణించి లేచిపోయారు. నేను మాత్రం వెంటనే లేవలేకపోయాను. ఇది ఆయన నాకు పారేసిన ఛాలెంజ్ !

నాకు వెంటనే పౌరుషం వచ్చింది. బోలెడు ఆవేశం వచ్చింది. కానీ చెప్పెనుగా — నేను వాస్తవికత ప్రభావానికి తొందరగా లొంగిపోతానని—

కొద్దిక్షణాలపాటు నాకీ సంసార బంధాలంటేనే అసహ్యం కలిగింది. హేమ పెళ్ళికి అవసరమయే కట్నంకోసం — నేను కట్నం పుచ్చుకోవాలా ? ఎందుకు పుచ్చుకోవాలి? పుచ్చుకోను. ఈ బంధాలను త్రెంచుకుని పద్మను పెళ్ళిచేసుకుంటాను. ఒక్కణ్ణీ హాయిగా వేరుకాపురం పెట్టుకుని నా ఆశయాల ప్రకారం జీవిస్తాను.

అంతలోనే నా అంతరాత్మ (అంతరాత్మే అయి ఉండాలి. అయి ఉండాలని ఎందుకంటున్నానంటే అది బతికి ఉందన్న నమ్మకం నాలో పూర్తిగా లేదు) నన్ను తిట్టింది. 'నీకు పద్మ ముఖ్యమా, హేమ ముఖ్యమా—నీ తోడబుట్టిన చెల్లి హేమ. నిన్ను ప్రాణప్రదంగా ప్రేమించిన చెల్లి హేమ. పదహారు సంవత్సరాలకు పైగా నీతో కలిసి మెలిసి తిరిగిన హేమ సౌఖ్యాన్ని—ఎప్పుడో ఒకసారి చూసిన పద్మ కోసం— నాశనం చేస్తావా?' అని ఒకే ఒక


# అనోలియమ్
## కోల్డ్ రబ్

**జలుబులను దగ్గులను నివారించే మరొక అమోఘమైన శక్తి**

అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారింపు

6 శక్తివంతమయిన ఔషధాలుకల అనోలియమ్ బాగా లోతుకి చొచ్చుకుపోయి గుణం ఇస్తుంది జలుబులు, దగ్గులు చప్పున చల్లగా తగ్గాలంటే అనోలియమ్! అనోలియమ్ తల్లిప్రేమవలె చల్లని,అంత శక్తికలది.అనోలియమ్ ఎలా వాడవచ్చునో చూడండి:




FDS AM 1819 TE

ఇప్పుడు సీసాలలో కూడా దొరుకుతోంది!

# అనోలియమ్

**వెలకూడా సరసమయినదే!**

# రక్తదానం

ప్రశ్న వేసింది.

ఆ ప్రశ్నకు నా దగ్గర జవాబులేదు. హేమ అంటే నాకున్న అభిమానం చెప్పడానికి మాటలు చాలవు. దానికోసం నేను ప్రాణాలైనా త్యాగం చేయగలను. అటువంటప్పుడు నాలోని ఆశయాలను త్యాగం చేయలేనా?

నేను తెలివైన వాడినే అనిపిస్తోంది. నేను వేయబోయే ప్రతీ తప్పటడుగూ నన్ను జీవిత సౌఖ్యానికి దగ్గర చేస్తోంది. ఆ విషయం గ్రహించే నేను తప్పటడుగులు వేస్తున్నాను. కానీ తప్పటడుగులు వేయడానికి మరో కారణాన్నాపాదించుకుని నన్ను నేనే మోసం చేసుకుంటున్నాను. అందుకే గదా తెలివితేటలు అవసరమయేది!

వెంటనే నేను నాన్నగారితో చెప్పాను పశువును సంతలోకి తోలవచ్చునని. ఆ మాట నా నోట రాగానే నాన్నగారి ముఖం వికసించింది. సంతలోకి తోలారు. అమ్మకానికో పేరయ్యగారు కుదిరారు. ఆయనకు నా గుణగణాలు కంఠోపాఠం. నన్ను గురించి నాకే తెలియని అనేక విశేషాలాయనకు తెలుసును.

అడపాతడపా తెలిసిన విశేషాలను బట్టి సంతలో నాధర పదివేల వరకూ పలుకనున్నదని తెలిసిపోయింది. ఈ ధరసంగతిలాగుండగా—నేను హేమ కోసం లోపాయికారీగా ప్రయత్నాలు చేసిచూశాను. ఎక్కడ చూసినా, ఎంత చచ్చు పెళ్లికొడుకైనా—మా ఇంటి ఆడపడుచును చేసుకోడానికి అయిదువేలు తక్కువలో కట్నం కుదిరేలా లేదు. మా హోదా అటువంటిది. హేమను సుఖపెట్టే పెళ్ళికొడుకు ధర పదివేల లోపులో ఉండడం కష్టం.

ఈ సంగతి తెలుసుకున్నాక నాకు నేనెంత అల్పుణ్ణో అర్థమయింది. అన్నీ నాన్నగారి మీదనే వదిలేయడం ఉత్తమమని గ్రహించాను. అంతేకాదు—నాన్నగారి వద్ద ఇంకా చాలాపాఠాలు నేర్చుకోవాలనీ—లేకపోతే సగం విద్య తెలిసిన అభిమన్యుడి గతే నాకూ పడుతుందనీ తెలుసుకున్నాను. అర్జునుడివంటి నాన్నగారు నాకున్నారు. ఆయన గుత్వాన్ని స్వీకరించాలి నేను.

చిట్టచివరకు ఒకసంబంధం చాలా దగ్గర్లోకి వచ్చింది. నా విద్యుక్త ధర్మంగా నేను పెళ్లిచూపులు చూసివచ్చాను. పిల్ల అనాకారి కాదు. నా కళ్ళకు ఆకర్షణీయంగా కూడా కనిపించింది. బియ్యే మొదటి సంవత్సరం చదువుతోందిట. ఒక్కర్తే ఆడపిల్ల. ఆమె అన్నగారు అమెరికాలో ఉన్నాడట. పిల్ల తండ్రికి స్వంతఇళ్ళూ, ఉద్యోగమూ ఉన్నాయి. ఆస్తిపాస్తులాట్టే లేవుగానీ ఉద్యోగం మంచిది. ఈ సంబంధం నాన్నగారి కన్నివిధాలుగా వచ్చింది—ఒక్క కట్నం విషయంలో తప్ప. ఒక్కర్తే ఆడపిల్ల కాబట్టి—ఎలాగో అలా తల తాకట్టయినా పెట్టి—ఏడెనిమిది వేలవరకూ ఇవ్వగలననీ—అంతకుమించి ఇవ్వలేననీ పిల్లతండ్రి అన్నాడట.

చెప్పొద్దూ—నాన్నగారికి నామీద చాలా అభిమానం, పదివేలు కట్నమివ్వడానికి చాలా మంది సిద్ధంగా ఉన్నప్పటికీ—ఆయన ఈ సంబంధానికే ఎంతో ఇష్టపడ్డారు. అందుక్కారణం—పిల్ల కాస్త అందంగా ఉన్న సంబంధ మిదొక్కటే! అందుకే ఆయనతో బేరాలు ప్రారంభమయ్యాయి. ఈ బేరాలలో నేనేమి పాల్గొనే అవకాశంలేదు. సంతలో పెట్టిన పశువుకు బేరాలతో నిమిత్తమేముంది? మాటలు నడిచేది — దాని యజమానికీ, కొనుక్కునేవాడికీ మధ్య! ఈ బేరానికి సంబంధించి నంతవరకూ నేను పశువునే.

చివరకు బేరం కుదిరింది. కట్నం ఎనిమిదివేల అయిదువందలు.

నాకు పెళ్లి అయిపోయింది. పెళ్లికి అమెరికాలో ఉన్న నా బావగారు రాలేదు. రానూపోనూ అయేఖర్చులు భరించలేక అతను అక్కణ్ణించే గ్రీటింగ్స్ పంపించేశాడు. అతను రాకపోవడం మా అమ్మ, నాన్నగార్లకు నచ్చలేదు. నేనుమాత్రం కొంతవరకూ అర్థం చేసుకున్నానతన్ని.

వివాహమయేక నేను కొంతకాలంపాటు నా పరిసరాలను మరిచిపోయాను. రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయ్. నా భార్య సుశీల చాలా మంచిది. నన్ను దైవంలా చూసుకుంటుంది. ఒకరితో దెబ్బలాడే మనస్తత్వంలేదు. అందువల్ల ఇంట్లోకూడా ఏ గొడవలూ లేకుండా బాగానే గడిచిపోతోంది.

నా వివాహమైన అయిదారు నెలలకు నాన్నగారు నన్ను పిలిచారు 'నిన్నరాత్రి పేరయ్యగారు హేమకొక మంచి సంబంధాన్ని నిశ్చయపరిచారు' అన్నారాయన.

'నాకేం తెలుస్తుంది. అన్నీ మీరే చూడగలరు. మీకు నచ్చినది నాకూ నచ్చుతుంది.' అన్నాను నేను.

'అదికాదు—' అన్నారాయన— 'కుర్రాడు బీటెక్ ప్యాసై సైంటిస్ట్‌గా పని చేస్తున్నాడు. పొరుగు రాష్ట్రంలో ఉంటున్నప్పటికీ అదేమంత ఫరవాలేదు. ఏడాదికోసారి ఇంటికొచ్చి పోతూనే ఉంటాడు. చాలా బుద్ధిమంతుడు. కుర్రాడు హేమకు ఈడూ జోడుగా ఉంటాడు, అన్నట్లు...' అని ఆయన జేబులోంచి ఒక ఫొటో తీసి ఇచ్చారు.

ఫోటో చూశాక వరుడు—అన్నివిధాలా నన్నుమించిన వాడనిపించింది. హేమ చాలా అదృష్టవంతురాలని కూడా అనిపించింది—మరి...

'కట్నంకూడా వారికి ఎక్కువ ఆశలేదు. ఆరువేలు చాలుట,' అన్నారు నాన్నగారు. 'కట్నం తీసుకునే ఉద్దేశ్యం వారి కసలు లేదుట. కానీ ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్ళు చేసిన అప్పుతీర్చడం కోసమని ఈ కట్నం కావాల్సొచ్చిందట—ఈ సంగతులు పేరయ్యగారు చెప్పారనుకో—'

'మరి బీటెక్ చదివాడంటున్నారు. సైంటిస్టుగా ఉంటున్నాడంటున్నారు. ఇద్దరు ఆడపిల్లల పెళ్లి వాళ్లింటో జరిగిందంటున్నారు. ఆరువేల కట్నాని కొప్పుకుంటున్నారంటే...' అన్నాను నేను అనుమానంగా. నా రేటే ఎనిమిదివేల అయిదొందలు. ఇతనిదీ కనీసం అంతకు తక్కువుండకూడదు.

నాన్నగారు నవ్వారు. 'వాళ్ళు ఆట్టే ఉన్నవాళ్లు కారు. వాళ్లది మనలా దర్జా అయిన సంసారమూ కాదు. వాళ్లకు స్వంత ఇల్లు లేదు. సెంటు భూమి లేదు. రెక్కలే ఆధారం. రెండేసివేల కట్నమిచ్చి—ఇద్దరి ఆడపిల్లల పెళ్లిళ్లూ చేసేసేట్ట— హఠాత్తుగా నాన్నగారు స్వరం తగ్గించి—ఆయన అప్పగారి ప్రవర్తన ఆట్టే మంచిది కాదని చెప్పుకుంటారు. అందువల్లకూడా ఎవరూ వాళ్లింటికి సంబంధానికి వెళ్లడం లేదు. అయితే నేను కుర్రవాణ్ణి గురించి విచారించాను. అతగాడు చాలా బుద్ధి

(40వ పేజీ చూడండి)

మంతుడు. అదేగదా మనక్కావలసింది...' అన్నారు.

కట్నం తక్కువ అడిగాలనిపిస్తే—ఇన్ని రకాల ఆలోచనలూ, ఆరాలూ వస్తాయన్న మాట—అనుకున్నాను. ఎందుకో ఆ ఫోటో చూసేక—హేమ ఆ కుర్రాడితో సుఖపడు తుందని నాకు అనిపించింది.

'నాకు బాగానే ఉన్నట్లు తోస్తోంది—మీకు నచ్చితే అన్నీ సెటిల్ చేసేయండి—' అన్నాను.

'అదికాదు—కట్నం ఆరువేలయితే—పెళ్లి ఖర్చు మరో అయిదారువేలు ఈజీగా అవుతుంది—' అన్నారు నాన్నగారు.

నా గుండె గుభేలుమంది.

నాపెళ్లి కట్నంలో అన్నిఖర్చులూ పోగా సుమారు ఆరువేలు మిగల్చగలిగాం. దాన్నలాగే బ్యాంకులో నాపేర జమకట్టారు. ఇప్పుడు హేమకోసం అది ఖర్చుచేసేయాలి. అంతసొమ్మూ—ఆరువేలూ — కాక—మరో ఆరువేలు.

నాన్నగారిదగ్గర ఇప్పుడు రెండువేలున్నట్లుంది. ఇంకా నాలుగువేలు...అమ్మ బాబోయి—ఇప్పటికిది ఒకపెళ్లి—ఆతర్వాత...

అసలు ఏఖర్చులూ లేకుండా, కట్నం ప్రసక్తిలేకుండా పెళ్లిళ్లు జరిగిపోతే—కాకుల్నికొట్టి గెద్దలకు వేసే ఈ పద్ధతి ఉండదుగదా అని ఒక్కక్షణంపాటు అనిపించింది. కానీ ఇది విషవలయం — పిల్లి మెడలో గంటకట్టేదెవరు?

ఆలోచించదల్చుకోలేదు నేను. 'మీ ఇష్టం. మీరెలాగో అలా డబ్బు తీసుకొస్తే—తీర్చడం విషయంలో నా పూర్తి సహకారం ఉంటుంది. మీమాట ఎప్పుడు కాదన్నాను?' అన్నాను.

నాన్నగారు తృప్తిగా శ్వాసపీల్చారు.

ఆ తర్వాత మరో సంవత్సరానికి హేమ పెళ్లి ఆ బీఈక్ యువకుడితో జరిగింది. మాకు తగిన దర్జాలో మేము పెళ్లిచేసి కట్నంకాక మరో అయిదువేలు ఖర్చు పెట్టారు. మాక్షేమంకోరే కొంతమంది పేదబంధువులు—ఇదే, పెళ్లిని రెండువేల ఖర్చులో జరిపించేయ వచ్చునని అంటే వారిపేద భావాలకూ, ఊహలకూ మేము గర్వంగా నవ్వుకున్నాం.

ఆ పెళ్లికి అమెరికామంచి నాబావ మరిది వచ్చాడు. పెళ్లి హడావుడిలో నేన

# రక్తదానం

(30వ పేజీ తరువాయి)

తన్ని సరిగ్గా గమనించే అవకాశం లేక పోయింది. పెళ్లయ్యేకనే ... అతగాడితో మాట్లాడే అవకాశం లభించింది. ఫారిన్‌లో అతగాడి చదువైపోయిందట. ఎక్కడైనా ఉద్యోగం దొరికేలోపులో — గవర్నమెంట్ లాబొరేటరీలో పూల్ఆఫీసర్ అయ్యే అవకాశ ముందట.

అతను మాట్లాడుతూంటే అతన్నెక్కడో చూసినట్లనిపించింది. అనిపించడంలోనూ చాలా గట్టిగా అనిపించింది. చాలాసేపు మధనపడి ఆమాట చివరికి అనేశాను—'మిమ్ముల్నెక్కడో చూసినట్లు నాకు అనిపిస్తోంది—'

అతను నవ్వాడు 'మీ నమ్మకం నిజమే. నేను మీ చెల్లెలికి మొదటిసారి రక్తదానం చేసినపుడు చూశారు—'

అవునవును. అరే అరే అతనే! నా చెల్లికి రక్తదానం చేసిన అపరిచిత యువకుడు—మా అమ్మ దృష్టిలో దేవదూత — నాకిప్పుడు బావగారు, నా భార్యకు స్వయానా అన్నగారు. కానీ...కానీ...'నా చెల్లెలికి మొదటిసారి రక్తదానం చేసినప్పుడు — అంటున్నారు. అంటే?'

'రెండోసారి కూడా మీ చెల్లికి రక్తదానం చేశాను. అప్పుడు మీరు నన్ను చూడలేదు.'

'అటువంటి అవసరం మళ్లీ నాచెల్లికి వచ్చిన గుర్తులేదే నాకు—' అన్నాను అనుమానంగా.

అతను అదోరకంగా నవ్వాడు. ఒకే రకం పరిస్థితుల్లో—రెండుసార్లు మీ చెల్లికి నేను రక్తదానం చేశాను. ఒకసారి నేను చేసిన రక్తదానం ఆమెను బ్రతికించింది. అప్పుడు మీరు వ్యాధిగ్రస్థులు కాబట్టి మీ రక్తం మీ చెల్లికి పనికిరాలేదు. రెండోసారి—స్త్రీకి వివాహంతోనే కదా అసలు జీవితం ప్రారంభమయేది. ఆజీవితంలో ఆమె అడుగు పెట్టడానికి కట్నంకావాలి. ఈసారి మీరింకా వ్యాధిగ్రస్థులుగా ఉన్నారు. డబ్బు అనేరక్తం బొత్తిగా మీ దగ్గరలేదు. ఆ రక్తాన్ని నేను దానంచేసి ఈనాటి మీ చెల్లెలి వివాహానికి కారకున్నాయాను.' ఒక్క క్షణం అతను ఆగాడు— 'అమెరికాలో నాకు స్కాలర్‌షిప్ వచ్చినపుడు అయిదువేలు అప్పుచేసి వెళ్లాన్నేను. రెండేళ్లలో అక్కడ నేను సంపాదించినది—ఆ అప్పు తీర్చడానికీ, నా చెల్లెలి పెళ్లికి సరిపోయింది. మళ్లీ నేను నేనుగా మిగిలాను. మీరు తీసుకున్న కట్నం మీ చెల్లెలి పెళ్లికోసమే గదా, మీ చెల్లెలిపెళ్లికి కట్నం అవసరం లేకపోతే మీరు కట్నం తీసుకోరు. అయినా ఇందులో నేనూ నష్టపోయింది లేదు లెండి. మళ్లీ మరో ఆడపిల్ల తండ్రో, అన్నయ్యో రక్తదానం చేసి నా నష్టం పూడుస్తారు. దీనికి అంతం లేదు. ఇది ఇలా కొనసాగి పోవలసిందే. దీనివల్ల అందరూ నష్టపోతారు. ఎవ్వరూ బాగుపడరు. అయినా ఈ పద్ధతి మనం వీడలేము. నిరంతర రక్తదానాలతో ప్రతి కుటుంబమూ క్షీణించడానికే అంగీకరిస్తాము. మన యువకుల్లో వ్యక్తిత్వంలేదు. మీరూ అంతే, నేనూ అంతే—ఏం చేస్తాం?'

అతనిమాటలు నన్నాలోచింప జేశాయి. నిజమే—ఈనాటి యువకులు వ్యాధిగ్రస్థులు. వాళ్లలో నేనూ ఒకడినే. అతి సులభంగా పరిష్కరించగల సమస్యను—చిక్కుముడుల్లో ఇరికించేస్తాం. అసమర్థతకు కారణాలు వెతుక్కుంటాం. మాకు వ్యక్తిత్వం లేదు. ధైర్యంలేదు. అత్యంత సామాన్య జీవులం...

ఈ ఆలోచనలు నాలో వచ్చినా నాకు నా బావగారి మీద కోపం రాలేదు. అతని మాటలు నాకు బాధ కలిగించనూ లేదు. నన్నతడపార్థం చేసుకోలేదు గదా అని ఆనందించాను. ●

